లక్ష్మీనగర్‌లో దత్త జయంతి ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌కాలనీ సాయి బాబా ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే దత్త జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాబాకు క్షీరాభిషేకం, అఖండ దీపారాధన, మండ పారాధన నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున్న హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు సాయిదత్త, లక్ష్మీగణపతి, నవ గ్రహ హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు నెరేళ్ల ప్రసాద్‌రావు, రాజ్యలక్ష్మి తెలిపారు.

గుట్కా తింటుండగా అమ్మమ్మ మందలింపు

● మనవడి అదృశ్యం



మహ్మద్ ఓవైస్ (ఫైల్)

సైదాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుట్కా తింటున్న మనవడిని చూసి అమ్మమ్మ మందలించడంతో అటు నుంచే అటే ఇంటి రాకుండా ఎటో వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. యాఖుత్‌పురా బాగే-ఎ-జహారాకు చెందిన విద్యార్థి మహ్మద్ ఓవైస్ (13) శనివారం ఇంటి సమీపంలో రోడ్డు పక్క గుట్కా తింటుండగా అమ్మమ్మ గమనించి మందలించింది. దీంతో భయంతో ఇంటికి రాకుండా ఎటో కనిపించకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం తెలిసిన వారినీ, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న జోనల్ సైబర్ విభాగ ఎస్ఐ మల్లేశం

జాగృత్ హైదరాబాద్- సురక్షిత్ హైదరాబాద్‌పై అవగాహన

చాదర్‌ఘాట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్ జోన్ సైబర్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూ మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాగృత్ హైదరాబాద్- సురక్షిత్ హైదరాబాద్ లో భాగంగా సమగ్ర సైబర్ నేరల నియంత్రణపై అవగాహన కల్పించారు. సైబర్ భద్రతపై సూక్ష్మ నైపుణ్యాలపై విద్యార్థులకు జోనల్ సైబర్ సెల్ ఎస్ఐ ఎస్.మల్లేశం అవగాహన కల్పించారు. డిజిటల్ పరిశుభ్రతకు సంబంధించిన అనేక కీలకమైన అంశాలను వివరించారు. సోషల్ మీడియా భద్రత, గోప్యతా సెట్టింగ్‌లపై అవగాహన కల్పిస్తూ అపరిచితుల వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌లకు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, సీనియర్ లెక్చరర్లతో పాటు సైబర్ క్రైమ్స్ కానిస్టేబుల్ సి.మహేశ్వరి, ఎం.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తొలగించండి



డీసీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎర్ర వినోద్‌రెడ్డి, టి.మణిపాల్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలనీలో చెత్త సరిగ్గా తొలగించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఎప్పటికప్పుడు చెత్త తొలగించేందుకు సహకరించాలని రాక్‌టౌన్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి కోరారు. డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణను మంగళవారం కాలనీ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి మణిపాల్‌రెడ్డితో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. కాలనీలో నిత్యం రోడ్లను ఊడ్చిన జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ చెత్తను కాలనీలో నాలుగు పాయింట్ల వద్ద డంప్ చేస్తున్నారన్నారు. అక్కడి నుంచి చెత్త సేకరణ టిప్పర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలిస్తారన్నారు. ఒక్క టిప్పర్ మాత్రమే వస్తుండటంతో పూర్తిస్థాయి చెత్తను తరలించలేకపోతున్నారన్నారు. మరో వాహనం ఏర్పాటు చేసి పూర్తి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు చొరవ చూపాలని కోరారు. సానుకూలంగా డీసీ వంశీకృష్ణ స్పందించినట్లు వినోద్‌రెడ్డి పేర్కొన్నారు.



ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి

ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

ఎల్‌బీనగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు ఉప్పల బాలస్వామిగుప్తా, ప్రధాన కార్యదర్శి భవనాశి వెంకటేశ్వర్లును వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం వాసవీకాలనీలోని జరిగిన కార్యక్రమంలో నూతన ఆర్యవైశ్య సంఘం కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా, ఆర్‌కేపురం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మాజీ చైర్మన్ జగిని రమేష్, ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు మంచుకొండ సైదయ్య, బ్రాహ్మణపల్లి రాములు, రామకోటి, శ్రీనివాస్, ఉప్పల సోమనాథంచ రామారావు, మురళీ, సోమయ్య, పోలా జనార్దన్, ఆర్‌కేపురం సొసైటీ ప్రతినిధులు రాజశ్రీ, రామారావు, సత్యనారాయణ, శ్రవణ్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ), జీఈసీఎఫ్ సంయుక్తంగా కెనడా యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్‌లో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు విదేశీ విద్య, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయా చరణ్, కో-ఆర్డినేటర్ డా. సూర్యవల్లి తెలిపారు. విండ్సర్ విశ్వవిద్యాలయానికి చెందిన డా.క్రిస్ బుష్ డిమాండ్ ఉన్న కోర్సులు, రీసెర్చ్ సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు, అడ్మిషన్ ప్రక్రియపై విద్యార్థులకు వివరించారు.

అక్రమ వైన్స్‌షాపు షెడ్లకు

హయత్‌నగర్ డివిజన్ అడ్డా



హయత్‌నగర్ జోరుగా నిర్మిస్తున్న వైన్స్ షాపు షెడ్లు

● హయత్‌నగర్, మన్సూరాబాద్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది సందర్శన

● ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు



హయత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో అక్రమ వైన్స్ షాపుల షెడ్లు వెలుస్తున్నాయి. 15 రోజులుగా వాటిని నిర్మిస్తున్నారు. అందులో మద్యం షాపులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి స్థానిక టౌన్ ప్లానింగ్ ఫీల్డ్ సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ షెడ్లను ప్రోత్సహిస్తూ త్వరగా నిర్మాణం పూర్తి చేసి కలర్ వేసుకోమని సలహాలు ఇస్తున్నట్లు పలువురు తెలిపారు. జాతీయ రహదారిపై వైన్స్‌షాపుల కోసం హయత్‌నగర్, మన్సూరాబాద్ ఏరియాలో షెడ్ల నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వారికి అందిన ఫిర్యాదు మేరకు ఇటీవల కొందరు అధికారులు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న షెడ్లను సందర్శించారు. ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే హయత్‌నగర్ బాతుల చెరువు కట్ట కింద రోడ్డు, ఆలూరి కాలనీ, హయత్‌నగర్ రాఘవేంద్రనగర్ కాలనీ ఫైర్ స్టేషన్ రోడ్డు, ఆర్‌టీసీ కాలనీలలో అక్రమ షెడ్ల నిర్మాణం నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి హయత్‌నగర్‌లో అనుమతి లేకుండా వైన్ షాపుల కోసం నిర్మిస్తున్న షెడ్లపైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభాగ్యులకు 'మాతృదేవోభవ' అండ

ఎమ్మెల్యే సబితారెడ్డి

అనాథాశ్రమానికి నెల వేతనం వితరణ

నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ



ఆశ్రమం నూతన భవనం నిర్మాణానికి నిర్వాహకుడు గిరితో కలిసి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అభాగ్యులను అక్కున చేర్చుకుని, వారికి నిరంతరం సపర్యలు చేస్తున్న మాతృదేవోభవ అనాథాశ్రమం అభాగ్యుల పాలిట దేవాలయంగా నిలుస్తున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కొనియాడారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ సమీపంలో గల రాగన్నగూడ వద్ద ఆశ్రమం కోసం నూతనంగా చేపట్టిన భవనం నిర్మాణానికి మంగళవారం ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఇటీవల గిరి తమ ఆశ్రమం గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఎమ్మెల్యే సబితారెడ్డి మానవతాదృక్పథంతో ఆశ్రమానికి నెల వేతనం విరాళంగా ఇవ్వాలని కోరగా ఆమె తన కుమారుడు కార్తీక్‌రెడ్డిని ఆశ్రమానికి పంపించి వివరాలు తెలుసుకొన్నారు. మంగళవారం నాటి భవనం భూమిపూజ సందర్భంగా ఆమె తన నెల వేతనం రూ.3లక్షలను చెక్కు రూపంలో గిరికి అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలను నిర్వాహకుడు గిరి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, శోభాఆనంద్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, భాగ్యనగర్ రైతు సొసైటీ మాజీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, నాదర్‌గుల్ మాజీ కౌన్సిలర్లు యెల్బల మమతాసుదర్శన్‌రెడ్డి, ఇంద్రవల్లి యాదగిరి, బీఆర్ఎస్ నాదర్‌గుల్ శాఖ అధ్యక్షుడు కోటగిరి జంగయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 125 ఫోన్లు.. యజమానుల చెంతకు



ఫోన్ అందజేస్తున్న ఏసీపీ కృష్ణయ్య

కొత్తపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న 125 ఫోన్లను పోలీసులు వాటి యజమానుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. "పోలీసులు నిరంతరం ప్రజల భద్రతకు విధులు నిర్వహిస్తారు. మూడు నెలల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టాం. సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ సాయంతో పోయిన మొబైల్ ఫోన్లను ట్రాక్ చేశాం. పలువురు పోగొట్టుకున్న ఫోన్లు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు సహా ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో గుర్తించాం. రూ. 12 లక్షలు విలువ చేసే మొత్తం 125 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నాం అని" పోలీసులు తెలిపారు. "బస్‌స్టాపుల్లో వేచి ఉన్నప్పుడు, వారాంతపు మార్కెట్లలో కూరగాయలు కొనే వేళా, బస్సు ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి. మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి అని" తెలిపారు. ఫోన్ల రికవరీలో కృషి చేసిన ఎస్‌హెచ్ఓ కే.వినోద్ కుమార్, డీఐ నాగార్జునరెడ్డి బృందాన్ని ఏసీపీ అభినందించారు. పోలీసులకు యజమానులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫోన్ చోరీ చేసి.. ఫోన్ పే ఉపయోగించి..

● రూ. 1.92 లక్షల కాజేత

సంతోష్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫోన్ చోరీ చేసి అందులో ఉన్న ఫోన్ పే యాప్‌ను ఉపయోగించి నగదు కొట్టేశాడు ఓ దొంగ. ఈ సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలెపల్లికి చెందిన రాధాకృష్ణారావు(74) మాజీ సర్పంచ్. గత నెల 13న నాగోల్‌లో ఉంటున్న కుమారుడి ఇంటి కొచ్చాడు. తిరిగి సాయంత్రం తన సొంతూరు పోలెపల్లికి వెళ్లేందుకు నాగోల్‌లో బస్సు ఎక్కి. మిధాని బస్టాండ్ వద్ద దిగాడు. ఆరాంఘర్‌కు వెళ్లే బస్సు ఎక్కి. కొద్ది దూరం ప్రయాణించాక తన సెల్‌ఫోన్ పోయిందని గుర్తించాడు. పోలెపల్లికి వెళ్లి కొత్త సెల్, సిమ్ వేసి పరిశీలించారు. అప్పుడే తన కెనరా బ్యాంకు సేవింగ్ అకౌంట్ నుంచి రూ.1.92లక్షల నగదు బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. వెంటనే చోరీపై మంగళవారం కంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యాప్ ద్వారా బదిలీ అయిన నగదు రూ.1.21లక్షలను ఫ్రీజ్ చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమసాగర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జక్కులి ప్రేమసాగర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'వైట్ ఎన్విరాన్‌మెంట్స్‌లో ఆబ్జెక్ట్ డిటెక్షన్, ప్రెషర్ ప్రెడిక్షన్' అంశంపై జియోస్పేషల్ డేటా ఆధారంగా డీప్ లెర్నింగ్ మోడళ్లతో ఆయన పరిశోధన సాగింది. యూసీఈ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. పి.వి. సుధా పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. ఈ పరిశోధన సర్వైలెన్స్, స్వయం చలిత వాహనాలు, పర్యావరణ మానిటరింగ్ వంటి రంగాల్లో కచ్చిత త్వం, సామర్థ్యం పెంపునకు ఉపయోగపడనుందని నిపుణులు తెలిపారు. ప్రేమసాగర్ సాధించిన ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.మాధవి, మేనేజ్‌మెంట్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఒకేసారి అందరికీ చెల్లించాలి: టీజీపీజేఏసీ

పెన్షనర్ల జేఏసీతో ప్రభుత్వ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్



ప్రసంగిస్తున్న టీజీపీజేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య

మన్సూరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా విడుదల చేసే రూ.700కోట్ల నిధులు కేవలం 2024 నుంచి రిటైరైన పెన్షనర్లకే చెల్లించాలని, లేకుంటే పెన్షనరీ బెనిఫిట్స్‌కు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి ఒకే నెలలో అందరికీ ఏకమొత్తంలో చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీపీజేఏసీ) చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి తులసి సత్యనారాయణలు కోరారు. వనస్థలిపురం టీజీపీజేఏసీ కార్యాలయంలో మంగళవారం సభ్యుల సమావేశం నిర్వహించారు. వర్కింగ్ ఎంప్లాయీస్‌కు పెండింగ్ బిల్లులు 80 శాతం చెల్లిస్తూ, పెన్షనర్స్‌కు చిన్నచిన్న బిల్లులు 20 శాతం చెల్లిస్తున్నారని అన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారమవ్వాలంటే పెన్షనర్ల జేఏసీతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సభ్యులు తీర్మానం చేశారు. సమస్యలపై ఈ వారంలో గవర్నర్‌ను కలవనున్నామని, ఈనెల 20 లోగా తమ బెనిఫిట్స్ మొత్తాన్ని చెల్లించకుంటే 24న కలెక్టరేట్ల ఎదుట దీక్షలు చేపడతామని తెలిపారు. సమావేశంలో టీజీపీజేఏసీ సభ్యులు పుల్లయ్య, శుభాకర్‌రావు, మోహన్ నారాయణ, జనార్దన్‌భట్, కృష్ణప్రసాద్, జ్ఞానేశ్వర్, జయప్రకాశ్‌రావు, నర్సింగరావు, నరసరాజు, కొహెడ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు





ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, గోపూజలో అష్టలక్ష్మి దేవాలయ కోశాధికారి అయిత అంజయ్యగుప్తా దంపతులు

ఎల్‌బీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ వాసవీకాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సాయంత్రం రుద్రహోమం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, మహా నివేదన, అమ్మవారికి మహా హారతి నిర్వహించారు. గోపూజలో అష్టలక్ష్మీ దేవాలయ కోశాధికారి అయిత అంజయ్యగుప్తా దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లో చేపట్టనున్న మరమ్మతు వల్ల బుధవారం 11 కేవీ హరిహర క్షేత్రం ఫీడర్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి

మద్యంమత్తులో వాహనాలు నడపొద్దు

కొత్తపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో వాహనాలు నడపొద్దని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 57 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో లెక్చర్ హాల్‌లో మంగళవారం 5 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని గుర్తించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే నడిపిన వారితో పాటు ఇతరులూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు.

హెచ్ఐవీ బాధితులకు అండగా ఉండాలి : కాలేరు

గోల్నాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితులకు అండగా మేమున్నామని వారికి సహాయ సహకారాలు అందిస్తున్న బేతెల్ గాస్పెల్ చర్చి సేవా నిరతి గొప్పదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లోగల బేతెల్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 350 మంది హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా మందులు, నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. బాధితులకు అందరూ అండగా ఉండాలని కాలేరు సూచించారు.



చెరువు శుభ్రత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్ యాదవ్

చెరువుల శుభ్రతకు సహకరించాలి

నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చెరువుల వద్ద చెత్త, ఇతర వ్యర్థాలు పారబోయకుండా శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ కోరారు. నాగోల్ డివిజన్.. చెరువుల సంరక్షణ, గుర్రపు డెక్క తొలగింపుపై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను మంగళవారం చింతల పరిశీలించారు. చెరువులు కలుషితం కాకుండా శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యంగా ఉంటామన్నారు. దాని పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు గుర్రపు డెక్క తొలగించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ డ్రైవ్ నిరంతరం ప్రక్రియగా కొనసాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, శానిటేషన్ సూపర్‌వైజర్ జనార్దన్, జీహెచ్ఎంసీ సిబ్బంది ఉన్నారు.



యాదగిరిగౌడ్‌తో కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షుడు తదితరులు

తొమ్మిది కాలనీల జేఏసీ చైర్మన్‌గా యాదగిరిగౌడ్

హయత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ లక్ష్మీప్రియకాలనీతో పాటు 9 కాలనీలతో ఏర్పాటు చేసిన ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) చైర్మన్‌గా బోజ యాదగిరిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సట్టు నాగయ్య, కోశాధికారిగా వరకాంతం నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్యామకూరి శ్రీనివాస్‌గౌడ్, నూనేముంతల రవిగౌడ్, సంయుక్త కార్యదర్శిగా వంగాల అచ్చిరెడ్డి, క్రీడల కార్యదర్శిగా కె. జయకృష్ణ, సలహాదారులుగా పీసరి శ్రీకాంత్‌గౌడ్‌లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నూతన చైర్మన్ యాదగిరిగౌడ్ మాట్లాడుతూ తొమ్మిది కాలనీలలో నెలకొన్న సమస్యలను అధికారులు, నాయకుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానన్నారు. తనను ఎన్నుకున్నందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి యావజ్జీవం

హయత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి ఎల్‌బీనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎంకె. పద్మావతి జీవిత ఖైదు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. బాధితుడికి రూ. 5 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని మంగళవారం తీర్పునిచ్చారు. 2020లో ఫిబ్రవరి 2న ఓ బాలుడు (9) ఆడుకుంటుండగా కుమరిబస్తీకి చెందిన తంగిరాల అంజిరెడ్డి (29).. బాలుడికి చాక్లెట్ ఇస్తానని చెప్పి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. వీడియో కూడా తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. బాలుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో అప్పట్లో వారు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపైన పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం కేసు తుది విచారణకు రాగా కోర్టు నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 25 వేల జరిమానా, బాధితుడికి రూ. 5 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.